క్లుప్తంగా

115 మందికి వైద్య పరీక్షలు



కొండయ్యపేటలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాంబాబునాయక్

కిర్లంపూడి: స్థానిక కొండయ్యపేట రామాలయం వద్ద బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కిర్లంపూడి పీహెచ్‌సీ డాక్టర్ బి.రాంబాబునాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది 115 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబునాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 64 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ పీహెచ్ఎన్ వైకే అన్నపూర్ణ, సీహెచ్ఓ కె.జ్యోతి, ఎంఎంహెచ్‌పీ ఎ.గంగ, హెల్త్ అసిస్టెంట్ కేవీ అప్పారావు, డీఈఓ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

తుని: స్థానిక రోటరీ క్లబ్ యువజనోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక శ్రీప్రకాష్, రాజా మైదానాల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. తుని పట్టణ, రూరల్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలల నుంచి భారీగా విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడాకారులను రోటరీ క్లబ్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు అభినందించి ఆల్ ద బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వర్మ, ట్రెజరర్ గణేష్, యూత్ యాక్టివిస్టు చైర్మన్ డాక్టర్ పి.ప్రసాద్, కో చైర్మన్ డాక్టర్ నాగిరెడ్డి, సీహెచ్ మంగరాజు, డీవీ రాజు, వివేక్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

కిర్లంపూడి: జగపతినగరం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. స్థానిక పంచాయతీలో బుధవారం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు కిర్లంపూడి శ్మశాన వాటికలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగించామన్నారు. మరోసారి చెత్త వేయకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో శ్మశాన వాటిక ప్రాంగణం చుట్టూ మొక్కలు నాటామన్నారు. ప్రహరీ, కుళాయి ట్యాంక్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుడాల రాంబాబు, కుర్ల చినబాబు, కాళ్ల తాతీలు, దాడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు బారికేడ్ల బహూకరణ



ఒంటిమామిడి ఎస్సై వెంకటేశ్వరరావుకు బారికేడ్లు అందజేసిన దివీస్ ప్రతినిధులు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి పోలీస్ స్టేషన్‌కు దివీస్ ల్యాబోరేటరీస్ ప్రతినిధులు 20 ఐరన్ బారికేడ్లు, స్టాపర్లను బహూకరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా దివీస్ సీనియర్ మేనేజర్ ఆర్.సుధాకర్ బుధవారం ఒంటిమామిడి ఎస్సై జి.వెంకటేశ్వరరావుకు రూ.5 లక్షల విలువైన 20 ఐరన్ బారికేడ్లు, 20 స్టాపర్లను అందజేశారు. ప్రధాన రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు వినియోగించాలని వీటిని ఉపయోగించాలని కోరారు. దివీస్ ప్రతినిధులు వాసుబాబు, సతీష్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ రాష్ట్ర నాయకుడు యనమల కృష్ణుడు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, జనసేన నాయకులు మేడిశెట్టి బాబి, నల్లల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

ప్రత్తిపాడు అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడంలో బూత్ లెవెల్ అధికారులకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో ఒకే విధంగా ఉన్న ఓటర్ల పేర్లు, ఒకే పేరు, ఫొటో రెండు, మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలోనూ ఉన్నట్టు గుర్తించామని, వాటిని సరిచేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి మండలాల తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, జి చిన్నారావు, జి.భీమారావు, డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ములగపూడిలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



సింగరంపాలెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



కాట్రావులపల్లిలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



తునిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



భద్రవరంలో మా నమ్మకం నువ్వే జగనన్న ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- సింగరంపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



అచ్యుతాపురంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని సింగరంపాలెంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలిచి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, వైస్ ఎంపీపీ కుంచె రాజా, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గ్రామ సర్పంచ్ బుద్ధరాజు గణపతిరాజు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, సూరిమిల్లి రాంబాబు పాల్గొన్నారు.

శంఖవరం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. మండలంలోని సీతంపేటలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. సర్పంచ్ తోట నాగజ్యోతి, కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గౌతు నాగు, గౌతు అర్జుబాబు, తోట కృష్ణ, తలపంటి తిరుపతిరావు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

తుని: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. పట్టణంలోని 22, 25 వార్డులకు సంబంధించి 11వ సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధి పొందిన వివరాలను తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. రెండు వార్డుల్లోనూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచంద్రరెడ్డి, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కౌన్సిలర్లు కోలా శ్రీను, కాసే సుమతి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి జగన్ కావాలి

ఏలేశ్వరం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అడపా పార్థసారథి అన్నారు. మండలంలోని భద్రవరంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అన్నివర్గాలకు న్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. తొలుత సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఏలేశ్వరం 15వ వార్డులో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ నీరుకొండ రామకుమారి, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు, ఉగ్గిన రాజు, చీమల వెంకన్నబాబు, కాకర రాంబాబు, కూనపురెడ్డి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

రౌతులపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అన్నారు. ములగపూడిలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. తొలుత స్థానిక రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వెస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి మళ్లీ పట్టం కట్టాలి

గోకవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని అచ్యుతాపురంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేశారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సర్పంచ్ బత్తుల శ్రీను, ఎంపీటీసీ కొత్తపల్లి బుజ్జి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

కోటనందూరు: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని బిళ్లనందూరులో సర్పంచ్ బొత్స మంగ అధ్యక్షతన బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ లంక ప్రసాద్ పాల్గొన్నారు.

తొండంగి: ప్రజలకు ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే మళ్లీ ఏపీకి జగన్ ముఖ్యమంత్రి కావాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని గోపాలపట్నంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం.. నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పార్టీ నాయకులు కొయ్యా మురళి, దడాల విజయ్, గాబు రాజు, దూళ్లిపూడి అంజి, బెక్కం చంద్రగిరి, సర్పంచ్ కటకం శివ, ఎంపీటీసీ గునిమానికల ఏసుబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడురూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. మండలంలోని బవురువాకలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి వీరబాబు వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ అమరాది కాశీ, అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దలే చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తకపఠనం తప్పనిసరిగా చేయాలన్నారు. పుస్తకపఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందన్నారు. గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

గోకవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గోకవరం శాఖా గ్రంథాలయం అధికారి కె.ప్రియదర్శిని ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. చదువంటే మా కిష్టం నినాదాలు చేశారు. అనంతరం గ్రంథాలయంలో మోటివేషనల్ స్పీకర్ తీగల శివాజీ విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, పుస్తక పఠన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

ఆదర్శప్రాయుడు అరుణ్‌కుమార్

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా



కొత్తపాకలులో దివంగత ఎంపీపీ అరుణ్‌కుమార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: చిన్న వయస్సులోనే ప్రజా ప్రతినిధిగా మెరుగైన సేవలు అందించి ప్రజల మనస్సుల్లో చోటు సంపాదించిన దివంగత ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ అందరికీ ఆదర్శనీయుడని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఒంటిమామిడి పంచాయతీ కొత్తపాకలులో ఇటీవల మృతి చెందిన ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ స్మారక విగ్రహాన్ని గురువారం మంత్రి రాజా ఆవిష్కరించారు. అరుణ్‌కుమార్ స్మారక విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అరుణ్‌కుమార్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జెడ్పీటీసీగా ప్రస్తుతం కాకినాడ జిల్లాలో ఎంపీపీగా సేవలందించి ప్రజల్లో చెరగని ముద్రవేసుకున్నాడని కొనియాడారు. ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ తల్లి అమ్మాజీ, భార్య సుశీలను పలకరించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని, పలువురి తన వ్యక్తి గత నిధులను ఆర్థిక సహాయంగా అందించారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, పార్టీ నాయకులు మేరుగు ఆనందహరి, అంగుళూరి సుశీల, దడాల విజయ్, పేకేటి సూరిబాబు, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సర్పంచ్ అంగుళూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ఏలేశ్వరంలో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో టీబీ రోగులకు బుధవారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ప్రధానమంత్రి టీబీ ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా మండల వైద్యాధికారి శైలజ ఆధ్వర్యంలో రోగులకు న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ టీబీ రోగులు వైద్యుల సూచనలు పాటించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధిని నయం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఎస్ అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, వాగు బలరామ్, మసిరపు నాగేశ్వరరావు, కాకాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసంపద అభివృద్ధికి కృషి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సత్యనారాయణ

తొండంగి: సముద్రంలో మత్స్యసంపద అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని సీఎంఎఫ్ఆర్ఐ (సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) సైంటిస్ట్ డాక్టర్ జోకే కిజకుదన్, కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని దానవాయిపేట మత్స్యకార కమ్యూనిటీ భవనంలో బుధవారం మత్స్యకారులకు కృత్రిమ రీఫ్స్ ఏర్పాటు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సుమారు వెయ్యి కిలోల బరువైన సిమెంట్ బాక్సులు (కృత్రిమ రీఫ్స్)ను సముద్రంలో ఏర్పాటు చేయడం వల్ల సముద్ర జీవులకు ఆవాసాలు ఏర్పాటు అవుతాయన్నారు. తద్వారా మత్స్య సంపద అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వీటి ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 వాటాలో భరిస్తాయన్నారు. తీర ప్రాంత మత్స్యకారులు కృత్రిమ రీఫ్స్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.ఉమామహేశ్వరరావు, తాళ్లరేవు ఎఫ్‌డీఓ డాక్టర్ జి.గోపి, సర్పంచ్ మడదా తిరుమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగుపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ జోకా అమృత

కిర్లంపూడి: రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలని పెద్దాపురం ఏఏడీ దైవకుమార్ సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ జోకా అమృత అధ్యక్షతన బుధవారం రైతులు, ఇరిగేషన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ ఎన్.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వ తక్కువగా ఉందన్నారు. జగపతినగరం, సింహాద్రిపురం, కృష్ణవరం, రామచంద్రపురం, శృంగరాయునిపాలెం గ్రామాల్లో రబీలో వరి పంటకు నీరు విడుదల చేయడం కష్టమవుతుందన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలన్నారు. ఏఓ అమృత మాట్లాడుతా రానున్న రబీకి నీటి ఎద్దటి ఉన్నందున పైన తెలిపిన గ్రామాల్లో రైతులు అపరాలు, ఇతర పంటలు వేయాలన్నారు. సార్వా పంటలకు అంతరాయం లేకుండా డిసెంబర్ నెలాఖరు లోపు అపరాలు పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన



గోకవరంలో నిర్మిస్తున్న ప్రభుత్వాస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రూ.6 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. భవనంలో కల్పిస్తున్న వసతులు, ఇతర నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్ నెలాఖరు నాటికి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, పెనుగొండ సత్యానందం, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రత్తిపాడు: సినీ హీరో సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ప్రత్తిపాడులో కృష్ణ అభిమాన సంఘ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ఈశ్వర స్టూడియోలో కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సినీ రంగంలోకి 70 ఎంఎం, కలర్, స్కోప్ వంటి వినూత్న ఒరవడులు తీసుకువచ్చిన ఘనత కృష్ణకే దక్కుతుందని కొనియాడారు. అనంతరం కృష్ణ అభిమాన సంఘ అధ్యక్షుడు సలాది కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక జాతీయ రహదారిపై గల శ్రీశారదా వయోవృద్ధ నిలయంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వికలాంగులకు పండ్లు, రొట్టెలతో పాటు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ అభిమాన సంఘ సభ్యులు భేరి రాంబాబు, వేగి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బుధవారం సినీ హీరో సూపర్‌కృష్ణ వర్ధంతిని నిర్వహించారు. కృష్ణ వీరాభిమాని దొడ్డిపట్ల ఏసుబాబు ఆధ్వర్యంలో కృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

కిర్లంపూడి: జగపతినగరంలోని గౌరీశంకరుల ఆలయం ప్రాంగణంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడి పూజలో స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. తొలిత గ్రామ పుర వీధుల్లో స్వాములు పేటతుళ్లి నిర్వహించారు. మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అయ్యప్ప భక్తి మండలి సభ్యులు చర్యలు చేపట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రత్తిపాడు రూరల్: రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని సొసైటీ అధ్యక్షుడు కొప్పన గంగారాం అన్నారు. మండలంలోని ఒమ్మంగి రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నిమ్మల గణేష్, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, పార్టీ యూత్ లీడర్ రామిశెట్టి బుల్లి రామకృష్ణ, సొసైటీ సిబ్బంది మురళీ, రామారావు, మామిడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల బాలికపై లైంగిక దాడి

గండేపల్లి: అభంశుభం తెలియని ఐదేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని కె. గోపాలపురం గ్రామానికి చెందిన ఐదేళ్ల పాప మంగళవారం స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన 31 ఏళ్ల వయస్సు గల వ్యక్తి పాపను సందులోకి తీసుకెళ్లి లైగింక దాడి చేశాడు. దీనిపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు

గండేపల్లి: మండలంలోని పోలవరం, పుష్కర కాలువ గట్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఈఈ భవాని బుధవారం గండేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీల సహాయంతో ట్రాక్టర్లు, లారీలలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కోటనందూరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లల (దివ్యాంగులు) అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ అన్నారు. స్థానిక నాస్‌భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నాయకులు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మామిడి శేఖర్, హెచ్ఎం జయమ్మ, సీఆర్పీ శేఖర్, ఐఈడీఎస్ టీచర్ కమలకుమారి, ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

శంఖవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు బుధవారం బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బాలికలు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణాశ్రీ తదితరులు పాల్గొన్నారు.